www.aknu.edu.in
nannayavani@aknu.edu.in
nannayanewstv
Adikavi Nannaya University
9701293231

For Internal Circulation Only

# నన్నయ వాణి

An in-house Weekly Newsletter

ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం, రాజమహేంద్రవరం - ఆంధ్రప్రదేశ్

Accredited by NAAC with 'B+' Grade, ISO 9001 : 2015 & AICTE Certified

గౌరవ సంపాదకులు
ఆచార్య కొప్పిరెడ్డి పద్మరాజు
ఉపకులపతి

ప్రధాన సంపాదకులు
ఆచార్య గోడి సుధాకర్
కులసచివులు

సంపాదకులు
డా.తలారి వాసు
సహాయాచార్య
తెలుగు శాఖ

పువ్వల ఆనంద్
ప్రజా సంబంధాల అధికారి
కోఆర్డినేటర్, మీడియా సెల్

సంపుటి : 3 | సంచిక : 52 | 25-09-2023 | పుటలు : 4


# నన్నయలో ఘనంగా జిల్లాస్థాయి యువజనోత్సవాలు

## ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు





ఆదికవి నన్నయ యూనివర్సిటీ కన్వెన్షన్ సెంటర్ లో జిల్లా స్థాయి యువజనోత్సవములను స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని బుధవారం యువజన సర్వీసుల శాఖ, సెట్రాజ్, కాకినాడ వారి ఆధ్వర్యములో ఘనంగా నిర్వహించారు. యువతీయువకులలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి తమ నైపుణ్యమును ప్రదర్శించుకొనుటకు వీలుగా 15-29 సంవత్సరముల మధ్య వయస్సుగల యువతీయువకులకు వివిధ సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక విభాగంలో జానపద నృత్యం (గ్రూపు, సోలో), జానపద గేయాలు (గ్రూపు, సోలో), జీవన నైపుణ్యంలో కథ వ్రాయడం, పోస్టర్ తయారీ, ఫోటోగ్రఫి, ఉపన్యాసం, డిజిటల్ ఇండియాలో ఇ-గవర్నెన్స్ ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ రంగ కార్యక్రమాలు, విలువలు సృష్టించే వినూత్న యాప్ లు, లైఫ్ మిషన్ లో పర్యావరణ పరిరక్షణ, యువ కృతిలో పాల్గొనేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడింది. ఈ పోటీలలో జిల్లా స్థాయిలో ప్రథమ స్థాయి విజేతలను, రాష్ట్ర స్థాయి పోటీలకు మరియు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానము పొందిన విజేతలను జాతీయస్థాయి పోటీలకు పంపించడం జరుగుతుంది. జిల్లా స్థాయి యువజనోత్సవములను శ్రీయుత జాయింట్ కలెక్టర్ ఎన్. తేజ్ భరత్, ఐ.ఎ.ఎస్., వీసీ ప్రొఫెసర్ కె. పద్మ రాజు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ కె. సుధాకర్, ముఖ్యకార్యనిర్వహణాధికారి, సెట్రాజ్ కె. శ్రీ రమణి లు జ్యోతిప్రజ్వలన చేసి ప్రారంబించినారు. సాయంత్రం ముగింపు కార్యక్రమంలో వివిధ పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లను ప్రధానం చేశారు. జానపద నృత్యం (గ్రూపు)లో భావయాని గ్రూప్ ప్రథమ స్థానం, జె. అఖిల గ్రూప్ ద్వితీయ స్థానం, శ్రీయాత గ్రూప్ తృతీయ స్థానం, జానపద నృత్యం (సోలో) లో బడుగు దీపిక ప్రథమ స్థానం, కె.వి.ఎస్. వర్ణిక ద్వితీయ స్థానం, పడిశెట్టి డోల సరస్వతి తృతీయ స్థానం, జానపద గేయాలు (గ్రూపు)లో నానా కుమారి గ్రూప్ ప్రథమ స్థానం, రఘు %ఒ% టీమ్ ద్వితీయ స్థానం, వి. రామోజీ దీపిక తృతీయ స్థానం, జానపద గేయాలు (సోలో) లో రాగ సుధ ప్రథమ స్థానం, చిలకపాటి సువర్ణ శ్రీ ద్వితీయ స్థానం, యాగి చక్రవర్తి తృతీయ స్థానం, కథ వ్రాయడంలో ఎన్. హరమ్య ప్రథమ స్థానం, రాజ్ బైడ్ ద్వితీయ స్థానం, ఉండ్రు అనూష తృతీయ స్థానం, పోస్టర్ తయారీలో కె. లాజర్ ప్రథమ స్థానం, సలాది అరుణ ద్వితీయ స్థానం , అంజూరి గాయత్రి తృతీయ స్థానం, ఫోటోగ్రఫిలో కందుల ప్రవీణ్ ప్రథమ స్థానం, మహమ్మద్ అబ్దుల్ రహీమ్ ద్వితీయ స్థానం , నిర్మాల్య రాయ్ తృతీయ స్థానం, ఉపన్యాసంలో ఈ. వికాస్ కుమార్ ప్రథమ స్థానం, ఎన్. హరమ్య ద్వితీయ స్థానం, మహమ్మద్ మోనా ఆరోజ్ తృతీయ స్థానం, ఇ-గవర్నెన్స్ ని అందరికీ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వ కార్యక్రమాలలో కోనేరు గణేశ్ ప్రథమ స్థానం, ఎమ్. బాలకృష్ణ తేజ ద్వితీయ స్థానం , మహమ్మద్ మోనా ఆరోజ్ తృతీయ స్థానం, పర్యావరణ పరిరక్షణ పై వ్యాస రచనా పోటీలలో ముమ్మిడి ఆదిలక్ష్మి ప్రథమ స్థానం, వాసంశెట్టి ఇందిరా ప్రియదర్శిని ద్వితీయ స్థానం , పాక మహి తృతీయ స్థానం, యువకృతిలో పాల్గొనేందుకు హస్తకళల కళాకారులు ఎన్. దుర్గా చక్ర శ్రావణి ప్రథమ స్థానం, దాస్యం వెంకట త్రివిక్రమ్ ద్వితీయ స్థానం సాయి బాల అపర్ణా కాంచినాదం తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో సెట్రాజ్ మేనేజర్ కె. ఎస్.వి. కాశీ విశ్వేశ్వర రావు, సూపరింటెండెంట్ శ్రీ సి.వి. సూర్యనారాయణ, ఫీల్డ్ ఆఫీసర్ శ్రీ కె.ఎన్.వి.గౌతమ్ రాజ్, న్యాయ నిర్ణేతలు మరియు సెట్రాజ్ సిబ్బంది పాల్గొన్నారు.













# సంపాదకీయం



## ముఖ్యమైన వ్యక్తి

అవును. మనల్ని మనం ప్రేమించుకోవాలి. మనుషుల్ని ప్రేమించాలి. వస్తువుల్ని వాడుకోవాలి. దురదృష్టం ఏంటంటే వస్తువుల్ని ప్రేమిస్తూ మనుషుల్ని వాడుకునే తరం నడుస్తుంది. సెల్ఫోన్‌కి, బ్యాగ్‌కి, బైక్‌కి, కారుకి చిన్న గీత పడితే రక్త పోటు పెరిగిపోయే తరం నడుస్తోంది. విలువైన సున్నితమైన వస్తువుల్ని ఖరీదు పెట్టుకొని సేవలు చేస్తూ వాటిని ప్రేమిస్తూ వాటికి కాపలా కాసే తరం నడుస్తుంది.

బాల్యంలో ఇరవై రూపాయల ఖరీదు చేసే మ్యూజిక్ సెల్ ఫోన్, ప్లాస్టిక్ కారు విరిగిపోయినప్పుడు చిన్నపిల్లోడు ఏడుస్తాడు. రెండు వేలు ఖరీదైన బ్యాటరీ రిమోట్ కారు పోయినప్పుడు కూడా అంతే. ఇరవై లక్షలు ఖరీదైన కారుకు గీత పడినప్పుడు చిన్నసొట్ట పడ్డప్పుడు కూడా అంతే. బిపి పెరిగిపోతుంది. విపరీతమైన ఒత్తిడి, ఆందోళన వీటితో అనారోగ్యం కూడా పెరుగుతుంది.

వస్తువుల సౌకర్యాల స్థాయి పెరిగింది. మనిషి వేదన మాత్రం బాల్యం నుంచి అదే స్థాయిలో కొనసాగుతోంది.

చిన్నప్పటి ఆట బొమ్మలు వినోదం కోసం. ఇప్పుడున్న అధినాతన యంత్రాలన్నీ సౌకర్యం కోసం. వాటికోసం బెంగపడటం, కన్నీరు కార్చటం అనారోగ్య హేతువులే. మనిషి మాట, అనుబంధం, ఆప్యాయత, ప్రేమ... ఇవి మార్కెట్లో దొరకవు. మన దినచర్యలోని వస్తువుల కన్నా మనం మన చుట్టూ ఉన్న మనుషులు చాలా ముఖ్యమైన వాళ్ళు.

వీళ్ళు మనకు ఎలా ఉపయోగపడతారు, మనం మన సొంత పనులకు వీళ్ళను ఎలా వాడుకోవచ్చునని ఆలోచించే ధోరణి వలన మనకు ముందుగా బద్ధకం, అనారోగ్యం మొదలవుతుంది. చివరకు మన పనులు మనం చేసుకోలేని మనుషులుగా మారిపోతాం. సంకుచితమైన గోడల మధ్య మనసులు పెలుసు బారిపోతాయి. అన్ని విషయాలకన్నా ముందుగా మనకు మనమే ఎక్కువ అని భావిస్తున్నప్పుడు మనల్ని మనం ఎంతగా ప్రేమిస్తున్నామో ఇతరుల విషయంలో కూడా అంతే. ఇందులో సంశయం లేదు. అందుకే మనకు మనమే చాలా ముఖ్యమైన వ్యక్తి.

*ప్లీజ్.....వస్తువుల్ని వాడుకుందాం! మనుషుల్ని ప్రేమిద్దాం!!*

# ఈసీ మెంబర్ గంధం నారాయణరావుకు సన్మానం




గంధం నారాయణరావును సన్మానిస్తున్న దృశ్యం

ఆదికవి నన్నయ యూనివర్సిటీ బిఈడీ కాలేజెస్ కరస్పాండెంట్స్ అండ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో యూనివర్సిటీ ఈసీ మెంబర్ గా నియమితులైన సందర్భంగా గంధం నారాయణరావు ను సన్మానించారు. శుక్రవారం యూనివర్సిటీ సెమినార్ హాల్ లో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వీసీ ఆచార్య కె.పద్మరాజు హాజరై బిఈడీ అసోసియేషను ఉద్దేశించి మాట్లాడారు. గంధం నారాయణరావు ప్రభుత్వ ఉద్యోగిగా విద్యారంగంలో 35 సంవత్సరాలు విశేష సేవలందించారని అన్నారు. ప్రస్తుతం లిటిల్ రోస్ విద్యాసంస్థల చైర్మన్ గా వ్యవహరిస్తున్నారని, అలాగే ఆదికవి నన్నయ యూనివర్సిటీ బిఈడీ కాలేజెస్ కరస్పాండెంట్స్ అండ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ కు గౌరవ అధ్యక్షులుగా సేవలందిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వ రంగంలో విద్యావేత్తగా అనుభవం ఉన్న గంధం నారాయణరావు యూనివర్సిటీ ఎగ్జిక్యూటీవ్ కౌన్సిల్ మెంబర్ గా నియమితులు కావడం హర్షనీయమన్నారు. తమ అనుభవంతో ఉమ్మడి గోదావరి జిల్లాల్లోని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయల్లోని బీఈడీ కళాశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేయాలన్నారు. బీఈడీ కళాశాలలు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు సమాజానికి ఉత్తమ పౌరులను అందించాల్సిన గురుతర బాధ్యత ఉందన్నారు. నాణ్యమైన ఉన్నత విద్యను అందించే దిశగా కళాశాలలకు విశ్వవిద్యాలయం పూర్తి సహాయ సహకారాలను అందిస్తుందని తెలియజేసారు. రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్ మాట్లాడుతూ ఈసీ మెంబర్ గా నియమితులైన గంధం నారాయణరావు కు శుభాకాంక్షలు తెలియజేసారు. బిఈడీ కళాశాలలు విశ్వవిద్యాలయానికి గర్వకారణంగా తయారు కావాలని పిలుపునిచ్చారు. ఈసీ మెంబర్ గంధం నారాయణరావు మాట్లాడుతూ ఈసీ మెంబర్ గా నియమించిన ప్రభుత్వానికి, యాప్సీ ఉన్నతాధికారులకు, విశ్వవిద్యాలయ వీసీ, రిజిస్ట్రార్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ బిఈడీ కాలేజెస్ కరస్పాండెంట్స్ అండ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈసీ మెంబర్ గంధం నారాయణరావు ను సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో సీడీసీ డీన్ ఆచార్య కె.శ్రీరమేష్, ఎడ్యుకేషన్ బీఓఎస్ చైర్మన్ డా.కె.సుబ్బారావు, ఆదికవి నన్నయ యూనివర్సిటీ బిఈడీ కాలేజెస్ కరస్పాండెంట్స్ అండ్ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డా.ఎం.శివకుమార్, వైస్ ప్రెసిడెంట్ బి.సత్యనారాయణ, సెక్రటరీ సువర్ణకుమార్ మరియు ఉమ్మడి గోదావరి జిల్లాల బీఈడీ కరస్పాండెంట్స్ అండ్ ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

# కాకినాడ క్యాంపస్‌లో ఎన్ఎస్ఎస్ ఆవిర్భావ దినోత్సవం




ఆదికవి నన్నయ యూనివర్సిటీ ఎంఎస్ఎన్ క్యాంపస్ కాకినాడ నందు 26 వ జాతీయ సేవా సమితి (NSS) ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు మరియు విద్యార్థులు ఉపాధ్యాయులు బోధనేతర సిబ్బంది కలసి ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో క్యాంపస్ ఇంచార్జ్ ప్రిన్సిపల్ డా. ఎం. పోచయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోచయ్య మాట్లాడుతూ జాతీయ సేవా సమితి ద్వారా భారత ప్రజలలో సేవాస్ఫూర్తిని విద్యార్థి దశ నుండి అందించాలనే సదుద్దేశంతో ఏర్పాటు చేసిన ఒక మంచి ఆశయాలతో కూడిన సంస్థ అని, గతంలో ఈ సేవా సమితి ద్వారా ఎన్నో మంచి కార్యక్రమాలు ప్రకృతి వైపరీత్యాలు, పర్యావరణ పరిరక్షణ, ఎన్నో అవగాహన కార్యక్రమాలు విద్యార్థులుచే నిర్వహించి విపత్కర పరిస్థితుల్లో ప్రజలను చైతన్యం చేసిన సంస్థగా దీనిని పేర్కొన్నారు. అలాంటి సంస్థలు మీరందరూ భాగస్వామ్యులు అయినందుకు విద్యార్థుల పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం ఎన్ఎస్ఎస్ అధికారులు డా.ఎం.నానిబాబు డా.ఎం.శ్రీదేవి ప్రిన్సిపాల్ చేతుల మీదుగా బెస్ట్ వాలంటీర్లకు అవార్డులను అలాగే పార్టిసిపేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డా.అప్పారావు, శ్రీమతి రాధామాధవి, దుర్గాభవాని తదితర బోధన మరియు బోధనేతర సిబ్బంది, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# గురజాడ జయంతి

సెప్టెంబర్ 21 మహాకవి గురజాడ జయంతి సందర్భంగా విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖలో ఆయన జయంతి కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. తెలుగుశాఖ కోఆర్డినేటర్ డా. కేవి.యన్.డి వరప్రసాద్ మాట్లాడుతూ మహా రచయితల, కవుల జయంతులు, వర్థంతిలు నిర్వహించడం ద్వారా వారు సాధించిన మహోత్కృష్ట కార్యకలాపాలతో పాటుగా, సమాజాన్ని వాళ్ళు ఏ విధంగా ప్రభావితం చేశారనేది మనకు తెలుస్తుందని వారి జీవితాల్లోని విశేషాలు మనకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. డా. తరపట్ల సత్యనారాయణ మాట్లాడుతూ అనువాద రంగంలో వెనుక పడటం వల్ల ఆయన సాహిత్యం ప్రపంచ దేశాలకు సరిగ్గా అందలేదని ఆయన సాహిత్యం విశ్వవ్యాప్తమైందని, విశ్వకవిగా వెలుగొందాల్సిన కవి గురజాడ అని, గురజాడ సాహిత్యం పై అంతర్జాతీయ సదస్సును నిర్వహించడంతోపాటుగా కందుకూరి వీరేశలింగం సంస్థలలో సామూహిక గురజాడ దేశభక్తి గీతాన్ని ఆలపించడం కార్యక్రమాల్ని విశ్వవిద్యాలయం చేసిందని తెలియజేశారు. గురజాడ దేశమును ప్రేమించుమన్నా అనే దేశభక్తి గేయం అంతర్జాతీయ సరిహద్దుల్లో ప్రవహించే అనంత భావాల సంగీతమని డా.తలారి వాసు కొనియాడారు. విద్యార్థులు కన్యాశుల్కం నాటకం, పూర్ణమ్మ కన్యక గేయాలు, నాటికలు గురించి మాట్లాడారు.




# నన్నయలో ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు ప్రారంభం

**ఫుడ్ ప్రాసెసింగ్ రంగం వచ్చే ఏడాదికి 9 మిలియన్ల ఉద్యోగావకాశాలు**
**బ్రోచర్ ఆవిష్కరించిన వీసీ ఆచార్య కె.పద్మరాజు**


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న వీసీ ఆచార్య కె.పద్మరాజు

భారతదేశపు ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 2024 నాటికి 9 మిలియన్ల ఉద్యోగాలను సృష్టిస్తుందని, ఈ నేపథ్యంలో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ప్రతిష్టాత్మకంగా ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును ప్రారంభిస్తున్నామని వీసీ ఆచార్య కె.పద్మరాజు తెలిపారు. శనివారం యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫుడ్ అండ్ టెక్నాలజీ కోర్సుకు సంబంధించిన బ్రోచర్ వీసీ ఆవిష్కరించి వివరాలను తెలియజేసారు. ఫుడ్ ప్రాసెసింగ్‌లో మ్యాన్‌పవర్‌కు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని సెంట్రల్ ఫుడ్ టెక్నాలజీకల్ రిసెర్చ్ ఇన్సిట్యూట్(సి.ఎఫ్.టి.ఆర్.ఐ), కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రీయల్ రిసెర్చ్ (సి.ఎస్.ఐ.ఆర్) మినిస్ట్రీ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా మైసూర్ వారి సౌజన్యంతో ఆదికవి నన్నయ యూనివర్సిటీలో ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఏపీ పీజీ సెట్ ద్వారా ప్రస్తుతం జరుగుతున్న కౌన్సిలింగ్ లో ఫుడ్ అండ్ న్యూట్రీషన్ సైన్స్ టెస్ట్ లో అర్హత సాధించిన వారు అర్హులని అన్నారు. అలాగే ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సులో చేరేందుకు బిఎస్సీ ఫుడ్ టెక్నాలజీ, బిఎస్సీఒకేషనల్ ఫుడ్ టెక్నాలజీ, బిఎస్సీ బయోటెక్నాలజీ, బిఎస్సీ మైక్రోబయాలజీ, బిఎస్సీ బయోకెమిస్ట్రీ, బిఎస్సీ హెూమ్ సైన్స్, బిఎస్సీ అప్లైడ్ న్యూట్రిషన్, బిఎస్సీ రూరల్ హెూమ్ సైన్స్, క్లినిక్ న్యూట్రిషన్ అండ్ డైటెటిక్స్, బిఎస్సీ ఫుడ్ సైన్స్ మరియు క్వాలటీ కంట్రోల్ మరియు బిఎస్సీ న్యూట్రిషన్ ను ఒక పేపర్ గా ఉండి గ్రూప్‌లో 50% మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు అర్హులన్నారు. ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యామండలి మరియు సి.ఎస్.ఐ.ఆర్ మధ్య అవగాహన ఒప్పందంలో భాగంగా ఇటీవల (06-09-2023న) మైసురులోని సి.ఎఫ్.టి.ఆర్.ఐ. ని సందర్శించానని, సి.ఎఫ్.టి.ఆర్.ఐ. డైరెక్టర్ లతో చర్చించామని అన్నారు. కోర్సు రూపకల్పనలో మార్గదర్శకత్వం అందించడానికి సి.ఎఫ్.టి.ఆర్.ఐ. అంగీకరించిందని తెలియజేసారు. కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రీయల్ రిసెర్చ్ (సి.ఎస్.ఐ.ఆర్) ప్రధాన సంస్థగా ఉందని, ఈ కోర్సుకు సంబంధించి విద్యా కార్యకలాపాలు సి.ఎఫ్.టి.ఆర్.ఐ. నుండి విద్యా నిపుణులు మరియు శాస్త్రవేత్తలు సహకరిస్తారని చెప్పారు. సి.ఎఫ్.టి.ఆర్.ఐ. మైసూరులో పూర్తి సెమిస్టర్ ఇంటర్న్‌షిప్ కు అవకాశం కల్పిస్తామని తెలియజేసారు. దీనికి సంబంధించి సి.ఎస్.ఐ.ఆర్. వారితో అవగహన ఒప్పందాన్ని కుదుర్చుకుంటున్నామని చెప్పారు. ఈ కోర్సుకు సంబంధించి నన్నయ విశ్వవిద్యాలయంలో రూ. 80 లక్షలతో ల్యాబ్ లను ఏర్పాటు చేసేందుకు నిధులు మంజూరు చేసామని తెలిపారు. అలాగే సి.ఎఫ్.టి.ఆర్.ఐ వంటి ప్రముఖ సంస్థలలో 40 సంవత్సరాలు అధ్యాపక వృత్తిలో విశేష సేవలందించిన ఆచార్య పి.రామకృష్ణ ను ప్రొఫెసర్ ఆఫ్ ప్రాక్టీస్‌గా యూజీసీ నిబంధనల ప్రకారం ఈ కోర్సు కోఆర్డినేటర్ గా నియమిస్తున్నామన్నారు. అనుభవజ్ఞులైన అధ్యాపక బృందంతో అధునిక ల్యాబ్స్‌తో సి.ఎఫ్.టి.ఆర్.ఐ. మైసూరు వారి సౌజన్యంతో నాణ్యమైన ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును అందుబాటులోనికి తీసుకువచ్చామన్నారు. సి.ఎఫ్.టి.ఆర్.ఐ. ల్యాబ్‌లు మరియు నన్నయ విశ్వవిద్యాలయం మధ్య రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్, శిక్షణ కార్యక్రమాలు, విద్యాపరమైన అంశాలను పంచుకునేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. ఆదికవి నన్నయ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీలో కేవలం 20 సీట్ల పరిమితితో ఈ కోర్సును అందిస్తున్నామని, అర్హత ఆసక్తి గల విద్యార్థులు ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలను యూనివర్సిటీ వెబ్ సైట్ ను సందర్శించాలని తెలియజేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సుధాకర్, గౌరవ ఆచార్యులు కె.వి.రావు, ప్రిన్సిపాల్ డా.పి.విజయనిర్మల, డా.కె.రమణేశ్వరి, డా.ఎ.మట్టారెడ్డి, డా.బి.జగన్మోహనరెడ్డి, డా.కె.దీప్తి, డా.పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## డిమాండ్ అధికంగా ఉన్న కోర్సులను తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నాం.



గోదావరి జిల్లా విద్యార్థులకు నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలని మహనీయుల ఆశయాలకు అనుగుణంగా సమాజంలో డిమాండ్ అధికంగా ఉన్న కోర్సులను తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నాం. దీనిలో భాగంగా ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును తీసుకువచ్చాం. ఈ కోర్సుకు సంబంధించిన అనుభవజ్ఞులైన అధ్యాపకులను నిబంధనలకు అనుగుణంగా తీసుకొని అధునాతన ల్యాబ్ వసతులతో కోర్సును విజయవంతంగా నిర్వహిస్తాం.అలాగే సి.ఎఫ్.టి.ఆర్.ఐ. మైసూరు వారితో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంటున్నాం. దీని ద్వారా విద్యార్థులకు, అధ్యాపకులకు ఎన్నో విద్యాపరమైన ప్రయోజనాలు చేకూరతాయి. నన్నయ విశ్వవిద్యాలయంలో ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సు చేసిన విద్యార్థులకు సి.ఎఫ్.టి.ఆర్.ఐ. మైసూరులో ఆరు నెలల ఇంటర్న్ షిప్ అవకాశాలు కల్పిస్తున్నారు. అన్నపూర్ణగా పిలువబడే గోదావరి జిల్లా లోని విద్యార్థులు ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సును చేయడం ద్వారా ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. భవిష్యత్ లో దేశ విదేశాలలో ఎక్కువ అవకాశాలు ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో ఉండబోతున్నాయి. అందరికీ అందుబాటులోకి కోర్సును తీసుకువచ్చాం దీనిని సద్వినియోగం చేసుకోండి.

**ఆచార్య కె.పద్మరాజు**
ఉపకులపతి,
ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం










## ఎంఎస్సీ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కోర్సుతో ప్రయోజనాలు

నిపుణుల అంచనా ప్రకారం భారతదేశపు ఫుడ్ ప్రాసెసింగ్ రంగం 2024 నాటికి 9 మిలియన్ల ఉద్యోగాలను సృష్టిస్తుంది. 2030 నాటికి భారతదేశ గృహ వినియోగం నాలుగు రెట్లు పెరుగుతుంది ఇది ఫుడ్ అండ్ ఫుడ్ టెక్నాలజీలో ప్రపంచంలోని ఐదవ అతిపెద్ద వినియోగదారుగా అవతరిస్తుంది దేశం యొక్క జి.డి.పి. కి 8% నుండి 20% వరకు రంగం దోహదం చేస్తున్నాయి. భవిష్యత్ లో ఎక్కువ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో ఉండబోతున్నాయి. 4.18 బిలియన్ డాలర్ల విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులను (2024-2020) ఆకర్షించిన ఈ అభివృద్ధి చెందుతున్న రంగం గణనీయమైన వృద్ధికి సిద్ధంగా ఉంది. ఎగుమతుల్లో 13% మరియు పారిశ్రామిక పెట్టుబడిలో 6% వాటాతో భారత ఆర్థిక వ్యవస్థకు ఆహార రంగం గణనీయంగా దోహదం చేస్తుంది. భారతదేశ ఆహార ప్రాసెసింగ్ రంగం దాని జి.డి.పి. సహకారాన్ని రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఆయిల్ పామ్, కోకో, యాసిడ్ లైమ్, బొప్పాయి, టమోటాలు మరియు మిరపకాయల ఉత్పాదకతలో భారతదేశంలో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో ఉంది. మామిడి, చెమట నారింజ మరియు పసుపు ఉత్పాదకతలో భారతదేశంలో రెండవ స్థానంలో, పాల ఉత్పత్తిలో ఏపీ 4వ స్థానంలో, మాంసంలో 4వ స్థానంలో, గుడ్ల ఉత్పత్తిలో 1వ స్థానంలో ఉంది. వరి, మొక్కజొన్న 2వ స్థానంలో, వేరుశెనగ మరియు మిల్లెట్ల ఉత్పత్తిలో కూడా అగ్రగామిగా ఉంది. రొయ్యల ఉత్పత్తిలో ఏపీ 66%తో మొదటి స్థానంలో ఉందని మరియు సముద్ర ఆహార నిపుణులలో 36% వాటాను కలిగి ఉంది. మ్యాన్‌పవర్‌లో 15% వాటాతో ఏపీ అగ్రస్థానంలో ఉంది. ఎన్నో ప్రయోజనాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్న ఈ కోర్సును దేశ ధాన్యాగారమైన గోదావరి జిల్లాల విశ్వవిద్యాలయమైన ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేయడంతో సార్ధకత చేకూరుతుంది.

# సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య

## (1861 - 1963)



### ప్రతిభవాణి

భారతదేశ మొదటి సివిల్ ఇంజనీర్ గా,భారతదేశంలో ఆనకట్టలను, రిజర్వాయర్లను నిర్మించి ఆధునిక భారత నిర్మాతగా, గొప్ప ఇంజనీర్ గా ఎదిగిన సర్ మోక్షగుండం విశ్వేశ్వరయ్య జన్మించిన సెప్టెంబర్ 15న భారత ప్రభుత్వం “ఇంజనీర్స్ డే”గా జరుపుకుంటుంది. ఈ ఇంజనీర్స్ డే ను విశ్వేశ్వరయ్య సాధించిన విజయాలను గౌరవించడానికి, గుర్తించడానికి,దేశంలో ఇంజనీర్ల ప్రతిభను వెలికితీయడానికి వీలుగా జరుపుకుంటున్నాము. విశ్వేశ్వరయ్య కర్ణాటకలోని మైసూర్ దగ్గర ముద్దినేహళ్లి అనే గ్రామంలో 1861 సెప్టెంబర్ 15న జన్మించారు. బాల్యం నుండి అనేక కష్టనష్టాలను ఎదుర్కొని విద్యాభ్యాసం పూర్తి చేశారు. దేశానికి రాబోయే రోజుల్లో వ్యవసాయం,పరిశ్రమలే మూలాధారమని గ్రహించి వాటిని వృద్ధిలోకి తీసుకురావడం ద్వారా దేశం వృద్ధిలోకి వస్తుందని భావించారు.అందుకే దేశంలో వ్యవసాయం కోసం అనేక రిజర్వాయర్లను, ఆనకట్టలను నిర్మించారు. 1912-18 మధ్య మైసూర్ దివాన్ గా పనిచేసే సమయంలో 1918లో ఆసియాలోనే అతి పెద్దదైన కృష్ణరాజసాగర్ ను కావేరి నదిపై నిర్మించి లక్షలాది ఎకరాలకు నీటిని,కోలార్ బంగారు గనులకు, బెంగుళూరు,మైసూర్ నగరాలకు విద్యుత్, త్రాగునీటి కొరతను తీర్చి మైసూర్ ఆర్థిక స్వరూపాన్ని మార్చివేశారు.అలాగే హైదరాబాదులో వచ్చే వరదల నివారణ కోసం నిజాం ప్రభువు ప్రత్యేక ఆహ్వానంతో ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ ఆనకట్టలను నిర్మించి హైదరాబాదును వరదల నుంచి రక్షించడమే కాకుండా త్రాగునీటి కొరతను తీర్చారు. అలాగే హైదరాబాద్,ముంబై నగరాలలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించారు.విశాఖపట్నం తీరప్రాంతంలో పోర్టును నిర్మించి తీర ప్రాంతం కోతకు గురికాకుండా కాపాడారు. రిజర్వాయర్లలో ‘ఆటోమేటిక్ వెయర్ వాటర్ ఫ్లడ్’ గేట్లను ప్రవేశపెట్టి ఆనాటి బ్రిటిష్ పాలకులతో ప్రశంసలు అందుకున్నారు. వైనవార్ సభ్యుల ఫ్యాక్టరీ నిర్మాణం, స్టేట్ బ్యాంక్ ఆఫ్ మైసూర్ ఏర్పాటు, వ్యవసాయ విశ్వవిద్యాలయ ఏర్పాటు, అనేక చెక్కెర మిల్లులు, పరిశ్రమలను ఏర్పాటు చేయడంలో కీలక భూమిక పోషించారు. అంతేకాకుండా “రీ కన్స్ట్రక్షన్ ఆఫ్ ఇండియా”,”ప్లానెడ్ ఎకానమీ ఆఫ్ ఇండియా” అనే రెండు పుస్తకాలను రచించి భారత ఆర్థిక వ్యవస్థ ఏ విధంగా ఉండాలో తెలియజేశారు.తన ప్రతిభతో గాంధీ,నెహ్రూలచే “భారత అపర భగీరధుడు”గా పిలిపించుకున్నారు.తన 102వ ఏట తుది శ్వాస విడిచే వరకు నిస్వార్థంగా దేశానికి సేవ చేసిన ధన్యజీవి విశ్వేశ్వరయ్య. ఈయన గురించి దేశంలోని ఎన్నో విశ్వవిద్యాలయాలు, కళాశాలలు తమ విద్యార్థులకు పాఠాలుగా బోధిస్తున్నారంటే ఈయన ప్రతిభ ఏంటో మనకు అర్థమవుతుంది. కేవలం తన ఇంజనీరింగ్ ప్రతిభతో అసాధారణ విజయాలు సాధించిన భారతజాతి ముద్దుబిడ్డ విశ్వేశ్వరయ్యను స్మరించుకోవడం మనకు కలిగిన గొప్ప అదృష్టం.

**బి.సుశాంత్ కుమార్**

### కవితావాణి

## మార్చుకోండి ప్లీజ్!



ముఖం ముడతల్లోని
పెదవి విరుపు వంకర నవ్వులు
విస్తరిస్తూనే ఉన్నాయి
మృత కణాలాంటి మాటల్లోని
వెటకారపుకంపు వ్యాపిస్తూనే ఉంది
మాటలు దిగజారి తిట్లుగా
తిట్లుదిగజారి దూషణలుగా
దూషణలుదిగజారి ఛీ పురాణంగా
హుందా సంప్రదాయాల నోట్లో
ఖాండ్రించి ఊసిపోతున్నాయి
కొత్త తరహా అశ్లీల ఇతిహాసం
ఖద్దరు గొంతులో
జబ్బలు చరుచుకుంటూనే ఉంది
నేలబారుగా ఢీ కొట్టి
మైకులు నోరుజారుతున్నకొద్దీ
భాష నిలువెల్లా
మ్యాన్ హోల్ లో కూరుకుపోతుంది
సంస్కారపు ఎరువుతో
ఏపుగా పెంచుకున్న
భాషా సంస్కృతులపంటంతా
బూతు తెగులుసోకి
తలదించుకుంది
భాష ఉత్కృష్ట రూపాన్ని
జనవ్యవహారంలోఉంచాల్సినవారు
దాని నికృష్టరూపాన్ని
మీడియా పాయింట్లలో
ప్రదర్శించొచ్చా?
విమర్శగాని ప్రతివిమర్శ రానీ
రాజకీయ పద్యానికి
అతుక్కుపోయిన ఐదో పాదాన్ని
సెన్సార్ చేయండి ప్లీజ్!
ఆవేశకావేశాలు ఎన్నున్నా
మృదువైన రాగాలతో
అవలీలగా పలికించగల
శిష్ట నిరసన ఛందస్సును
ఆశ్రయించండి ప్లీజ్!
పిల్లలంతా గమనిస్తున్నారు
భాష మార్చండి ప్లీజ్!!

**కంచరాన భుజంగరావు,**
**శ్రీకాకుళం**

## మంచిమాట



**ప్రవర్తన అనేది తెల్ల కాగితం వంటిది. ఒక్కసారి దాని మీద మరక పడితే మళ్లీ తెలుపు కావడం కష్టం!**

- బెంజమిన్ ఫ్రాంక్లిన్




ప్రచురణ : మీడియా సెల్, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం-రాజమహేంద్రవరం, ఈమెయిల్ :- nannayavani@aknu.edu.in